అంతర్వేదిలో వైభవంగా గ్రామోత్సవాలు - 6లో



పెన్షన్ కోసం పడిగాపులు

జిల్లాలో హెచ్ఐవీ బాధితులు 1,213 మందికి నేటికీ అందని వైనం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 17: సామాన్యుల కంటే భిన్నమైన పరిస్థితి హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులది. ప్రభుత్వం ఏఆర్టీ మందులు ఉచితంగా అందిస్తున్నా అందుకు తగ్గ పౌష్టికాహారం తీసుకోవలసి ఉంది. అప్పుడప్పుడు దాతలు పౌష్టికాహారం అందిస్తున్నా అది అంతంతమాత్రమే. వీరిలో ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నవారూ ఉన్నారు. జిల్లాలో పిల్లలనుంచి వృద్ధుల వరకు హెచ్ఐవీ బాధితులు 1,213 మంది ఉన్నారు. వారు ఆరోగ్య అవసరాల కోసం నెలనెలా పెన్షన్ అందించాలని పదేళ్ల పాటు పోరాటం చేశారు. ఎట్టకేలకు గత ఏడాది జనవరి నుంచి నెలకు రూ.3వేలు పెన్షన్ ఇవ్వడం ప్రారంభించారు. సామాన్యులతో కలిసి ఇవ్వకుండా ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా ప్రతినెలా వారి బ్యాంకు ఖాతాలకు పెన్షన్ మొత్తాన్ని జమ చేసేవారు. ఈ నెలలో అప్పుడే సగం రోజులు గడిచిపోయాయి. అయినా ఇంకా పెన్షన్ అందలేదు. దాంతో పలువురు బాధితులు 1902కు సమాచారం అందించారు. ఆ పెన్షన్ లేకపోతే బతకడం కష్టమని చెప్పిన వారూ ఉన్నారు. హెచ్ఐవీ బాధితుల పెన్షన్లు గ్రామ పంచాయతీలకు సంబంధం లేకపోయినప్పటికీ పలువురు 15 రోజులుగా ఆయా కార్యాలయాలతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పెన్షన్ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అయితే మెసేజ్ వస్తుందని నిత్యం ఆశగా ఎదురు చూస్తూనే వున్నారు. పెన్షన్ కోసం ఎవరిని అడగాలో... తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం పెన్షన్ బడ్జెట్ విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఈ విషయమై జిల్లా పర్యవేక్షణాధికారిగా ఉన్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మిని వివరణ కోరగా... ఇంతవరకు పెన్షన్ మంజూరు కాని మాట వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ జేఏసీ జిల్లా నాయకులు

ఉద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

కలెక్టరేట్ ఎదుట ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 17: ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని ఏపీ జేఏసీ కోనసీమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రాయితీలు, సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందనిజేఏసీ ఛైర్మన్ సీహెచ్ రాజశేఖర్ ఆరోపించారు. ఉద్యోగులకు కరువుభత్యం, పీఆర్సీ, రీయింబర్స్‌మెంట్ బకాయిలు వేల కోట్ల రూపాయలు పేరుకుపోవడం విచారకరమని, గతంలో ఎన్నడూ ఇటువంటి విపత్కర పరిస్థితిని ఉద్యోగులు ఎదుర్కోలేదని జేఏసీ కార్యదర్శి పుచ్చకాయల కోదండరామ్ ఆరోపించారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా ఛైర్మన్ నాగిరెడ్డి శివప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ డబ్బులను సైతం సమయానికి ఇవ్వకపోగా ఆ బకాయిలు ఇప్పటివరకు రూ.946 కోట్లు ఉండడం ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. ధర్నాలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, వరప్రసాదరావు, సీహెచ్ఎస్ఎస్ కృష్ణమూర్తి, శ్రీనివాస్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

శనేశ్వర ఆలయంలో పూజలు

కొత్తపేట, ఫిబ్రవరి 17: మందపల్లి శనేశ్వర (మందేశ్వర) ఆలయానికి శనివారం విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సర్వదర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.81,787, అన్నప్రసాద విరాళాల కింద రూ.25,623 వచ్చిందని ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.వి జయలక్ష్మి తెలిపారు.

నకిలీ నోట్ల ముఠా గుట్టు రట్టు

వివరాలు 6లో

విచ్చలవిడిగా లే-అవుట్‌లు

- నిబంధనలు పాటించని రియల్టర్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- నష్టపోతున్న ప్లాట్ల కొనుగోలుదారులు

ఆర్థిక మాంద్యంతో ప్రజల్లో కొనుగోలు శక్తి సన్నగిల్లినా లేఅవుట్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. 216 జాతీయ రహదారి విస్తరణ, జిల్లా విభజనతో కోనసీమలోని మారుమూల గ్రామాల్లో సైతం కొత్త లే-అవుట్లు పుట్టుకొస్తున్నాయి. వాటి పక్కనున్న పంట బోదెలు, మురుగునీటి డ్రెయిన్లు, ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించుకుంటున్నారు. అయినా పట్టించుకునే అధికారులే లేరు. సాఫ్ట్‌వేర్, ఆక్వా రంగాలు సంక్షోభంలో వున్నా, ప్లాట్లు కొనేవారి సంఖ్య తగ్గినా కొత్త లే-అవుట్లు మాత్రం వేస్తూనే ఉన్నారు. గతంలో కొనుగోలు చేసిన ప్లాట్లను కొన్న ధరకే విక్రయించినా వాటిని కొనే పరిస్థితి లేదు. అయినా అక్రమ లే-అవుట్లు ఆగడం లేదు.



ముమ్మిడివరం నగర పంచాయతీ చిప్పలపాలెంలో లే-అవుట్ పక్కనున్న పంటబోదెను కప్పేసిన దృశ్యం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17: వ్యవసాయ భూములను చౌకగా కొనుగోలు చేసి వాటిని హెచ్చు ధరలకు విక్రయించి రియల్టర్లు లాభాలు ఆర్జిస్తున్నారు. 216 జాతీయ రహదారి అయిన తర్వాత కోనసీమ జిల్లా ఏర్పాటై అమలాపురం జిల్లా కేంద్రం అయ్యింది. దీంతో ఎదుర్లంక నుంచి అమలాపురం వరకు రోడ్డు పక్కన ఉన్న భూములకు డిమాండు పెరిగింది. ఇదే అదనుగా రియల్టర్లు నిబంధనలను తుంగలో తొక్కి, ఎటువంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ ఈ అక్రమలే-అవుట్లపై చర్యలకు డిమాండు చేస్తున్నా అధికారుల చర్యలు శూన్యమనే చెప్పవచ్చు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేయాలంటే ముందుగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలో ఐదు శాతం ల్యాండ్ కన్వర్షన్ ట్యాక్స్ కట్టి ఆర్డీవో అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి. ఆర్డీవో వాటిని పరిశీలించి సాగునీరు, మురుగునీటి సమస్యలు తలెత్తవని గుర్తించిన తర్వాత అనుమతిస్తారు. అయితే ఆ నిబంధనలకు విరుద్ధంగా జీవో నెం.67ని తుంగలోకి తొక్కి, ల్యాండ్ కన్వర్షన్ ట్యాక్స్ కట్టకుండా కొబ్బరి తోటలు, వరి పొలాలను కప్పి లే-అవుట్లు వేస్తున్నారు. మొత్తం భూమిలో 10శాతం కామన్‌సైట్‌గా వదిలి 40 అడుగుల వెడల్పు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. ఈ తర్వాతే ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేసుకోవాలి. అంతకు ముందు నగర పంచాయతీ కమిషనరు నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే వీటన్నిటినీ పక్కనపెట్టి రియల్టర్లు అక్రమ లే-అవుట్ల వ్యాపారాన్ని జోరుగా సాగిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఎకరం భూమిని రూ.కోటి నుంచి రూ.2కోట్లకు కొనుగోలు చేసి మట్టి మాఫియా బ్రోకర్ల ద్వారా ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు కాంట్రాక్టుకు ఇచ్చి రాత్రికి రాత్రే ఆ భూములను కప్పేస్తున్నారు. ఇలా కప్పి వేసిన భూములను ప్లాట్లుగా విభజించి ఎకరం రూ.6 కోట్ల నుంచి రూ.8కోట్ల వరకు విక్రయిస్తున్నారు.

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో సుమారు 90 వరకు లే-అవుట్లు ఉండగా మండల పరిధిలో మరో 40 వరకు ఉన్నాయి. నగర పంచాయతీ పరిధిలో కేవలం మూడు లే-అవుట్లు మాత్రమే డీటీసీపీ అప్రూవల్ పొందాయి. మరో 47 రెగ్యులైజేషన్ స్కీములో అనుమతి పొందాయి. 176 వ్యక్తిగత ప్లాట్ల యజమానులు రెగ్యులైజేషన్ స్కీములో అనుమతికి దరఖాస్తు చేసుకోగా 125 ప్లాట్లను రెగ్యులైజ్ చేశారు. ఇంకా 51 ప్లాట్లు అనుమతిలో ఉన్నాయి.

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో నడిమిలంక పదో మైలురాయి, టీటీఆర్ నగర్, కొండాలమ్మ చింత, బాలయోగి కాల్వగట్టు, మహిపాలచెరువు తదితర ప్రాంతాల్లో 90 లే-అవుట్ల వరకు వెలిశాయి. మండల పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని కొమానపల్లి, అన్నంపల్లి, అనాతవరం, అయినాపురం, సీహెచ్ గున్నేపల్లి మొదలైన గ్రామాల్లో 40 వరకు అక్రమ లే-అవుట్లు ఉన్నాయి. తద్వారా నగర పంచాయతీ కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతోంది. ఈ అంశాన్ని ప్రతిపక్ష సభ్యులు ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ చర్చకు తీసుకువస్తున్నారు. అయినా నియంత్రణకు ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు అధిక మొత్తంలో ముడుపులు అందడమే కారణమనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అనధికార లే-అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఇళ్ల నిర్మించుకోవడానికి ప్లానింగ్ అప్రూవల్ పొందాలంటే సవాలక్ష ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆ స్థలానికి నగర పంచాయతీకి ట్యాక్స్ చెల్లించడంతో పాటు లోపాయికారీగా ముడుపులు కూడా ముట్టచెప్పాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లు నిర్మించుకునేవారు ఇబ్బందులు పడుతున్నారు



ములపర్తి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్

అనధికార లే-అవుట్లపై చర్యలు కోరుతూ ప్రతి కౌన్సిల్ సమావేశంలో చర్చకు తీసుకువస్తున్నాం. అయినా ఫలితం కనిపించట్లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఈ అక్రమ లే-అవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఇళ్ల నిర్మించుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. నగర పంచాయతీ కూడా కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతోంది.

స్పందనలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



జనిపల్లి దుర్గాప్రసాద్, ముమ్మిడివరం

అనధికార లే-అవుట్లపై చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖ అధికారికి స్పందనలో ఫిర్యాదు చేశాం. అయినా ఇప్పటి వరకు ఏవిధమైన చర్యలూ చేపట్టలేదు. పంట బోదెలను, మురుగునీటి బోదెలను కప్పేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటే నగర పంచాయతీకి ఆదాయంవచ్చే అవకాశం ఉంది. అనధికార లే-అవుట్లలో ఏవిధమైన నిబంధనలూ పాటించట్లేదు. కామన్ సైటును కూడా విక్రయించడం వల్ల నగర పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది.



కొండాలమ్మ చింత సమీపంలో...



శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో...



వైజంక్షన్‌లో వేసిన లే-అవుట్

'ఓట్ ఫర్ ఓపీఎస్'కు అనుమతి లేదు

ఎస్పీ శ్రీధర్... ఉపాధ్యాయులకు నోటీసులు అందజేసిన పోలీసులు



ఉపాధ్యాయుడు ఎంఎస్ఎన్ మూర్తికి నోటీసు అందజేస్తున్న పోలీసు



అయినవిల్లి పోలీస్ స్టేషన్లో...

అమలాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ఎటువంటి సభలు, సమావేశాలకు అనుమతులు లేవని కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆదివారం జరపతలపెట్టిన 'ఓట్ ఫర్ ఓపీఎస్' కార్యక్రమానికి విజయవాడ పోలీసు కమిషనర్ అనుమతులు లేనందున జిల్లా నుంచి సీపీఎస్ ఉద్యోగులు వెళ్లి ఇబ్బందిపడవద్దని సూచించారు. పోలీసుల అనుమతిలేని కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక శక్తులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారనే విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. శుక్రవారం రాత్రి నుంచే అమలాపురం పట్టణం, పరిసర మండలాల్లోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులకు పోలీసులు నోటీసులు అందించారు. 'చలో విజయవాడ'కు వెళ్లొద్దని హుకుం జారీ చేశారు. పలువురు ఉపాధ్యాయులను ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. అయినవిల్లి, మలికిపురం పోలీసుస్టేషన్ల వద్ద ఉన్న ఉపాధ్యాయులకు సంఘ నాయకులు పలువురు సంఘీభావంగా నిలిచారు. అయినవిల్లిలో ఎస్ఐ పిలుపు మేరకు వెళ్లిన తాము శనివారం గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం పట్ల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.



మలికిపురంలో ముందస్తుగా అదుపులోకి తీసుకున్న శ్రీనివాస్‌కు సంఘీభావంగా నిలిచిన ఉపాధ్యాయులు

దుకాణాల ఏర్పాటుకు ఇన్ని షరతులా!

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి తీర్థ మహోత్సవాలకు నెల ముందు నుంచే అటు అధికారులు, ఇటు దుకాణదారులు ఏర్పాట్లలో తలమునకలై ఉంటారు. కొన్నిసంవత్సరాలుగా దుకాణదారులకు ఎటువంటి పన్ను లేకపోవడంతో తీర్థ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సంవత్సరం దుకాణదారుల నుంచి గజానికి రూ.200 చొప్పున రూ.8వేలు వసూలు చేయడంతో ఆందోళన మొదలైంది. దీంతో అటు స్థల యజమానులు, ఇటు దుకాణదారులపై పెనుభారం పడింది. ఈ నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులను స్థానికులతో కలిసి దుకాణదారులు ముట్టడించారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా షరతులు పెట్టి పన్నులు విధిస్తున్నారని ముందుగా తెలిస్తే తీర్థ మహోత్సవాలకు వచ్చేవాళ్లం కాదని దుకాణదారులు చెప్తున్నారు. పోలీసులు తొక్కిసలాట జరగకుండా బందోబస్తు నిర్వహించాలి కానీ షరతులు పెట్టి మా పొట్టకొట్టడం సరికాదన్నారు. వెనుదిరిగి వెళ్లిపోవడానికైనా సిద్ధమని చెప్తున్నారు. పన్నులు విపరీతంగా పెంచడంపై ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డిని శనివారం సాయంత్రం దుకాణదారులు స్థానికులతో కలిసి అడిగారు. దుకాణాలు లేకపోతే తీర్థ మహోత్సవాలు బోసిపోతాయని, పన్నులు విధిస్తున్న పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. దీనికి ఆయన సమాధానమిస్తూ మరొకసారి అధికారులతో మాట్లాడి చెప్తానన్నారు. పది రోజులు ముందుగానే తీర్థ మహోత్సవానికి రావాలని ఏర్పాట్లు చేసుకున్న దుకాణదారుల పొట్టకొట్టడం సరికాదని మాజీ సర్పంచ్ వనమాలి మూలస్వామి, ముప్పర్తి నాని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐ గోవిందరాజు, ఎస్ఐ రాము తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శి సంతకాలు లేని ఎంఆర్ రసీదులను చూపిస్తున్న ముప్పర్తి నాని, వనమాలి మూలాస్వామి

పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం



అంతర్వేదిలో వైభవంగా గ్రామోత్సవాలు

- గరుడ పుష్పక వాహనంపై ఊరేగిన స్వామివారు
- బ్రహ్మరథం పట్టిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మించిన గురుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక స్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అప్పనపల్లి వాస్తవ్యులు దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, వలవల రాంబాబు, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావు (దత్తుడు), పోతురాజు వెంకటకృష్ణ, ఎస్ఐ ఎస్.రాము, అర్చకులు, వాహనకారులు పాల్గొన్నారు.

వన్‌వే రూట్ ఏర్పాటు



కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన దృశ్యం

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన స్వామివారి కల్యాణం, రథోత్సవాల రోజుల్లో వన్‌వే రూటు తప్పనిసరిగా కొనసాగించాలని సీఐ గోవిందరాజు అన్నారు. 19, 20 తేదీల్లో స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులందరూ అంతర్వేదిపాలెం, కేశవదాసుపాలెం, అంతర్వేది మీదుగా దేవస్థానం గుడికి చేరుకోవాలని, స్వామి కల్యాణం తిలకించి దర్శనం చేసుకున్న భక్తులు ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తూ అంతర్వేది ఏటిగట్టు నుంచి గొంది, గుడిమూల మీదుగా సఖినేటిపల్లి నుంచి సురక్షితంగా వెళ్లాలన్నారు. సఖినేటిపల్లి మండలంలో ఉన్న ప్రజలంతా వన్‌వే రూటుకు ఎదురు వెళ్లరాదని, పది రోజుల ఉత్సవాల్లో వన్‌వే రూటు పాటిస్తూ 19, 20 తేదీల్లో మాత్రం స్థానిక ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో నేటి కార్యక్రమాలు

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 7 గంటలకు ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4 గంటలకు హంస వాహనం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహరణ, రాత్రి 7 గంటలకు శేషవాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో తరించాలని కోరారు.



హైకోర్టు జస్టిస్ పూజలు

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏపీ హైకోర్టు జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా శనివారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఏసీ సత్యనారాయణ వారికి అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రాము, తహసీల్దార్ పెద్దిరాజు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బంధాల విలువలు తెలిసేలా..

ఆకట్టుకున్న నాటికలు




అమృతహస్తం నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 17: కుటుంబ సంబంధ బాంధవ్యాలు, భార్యాభర్తలు, అన్నాచెల్లెల అనుబంధం విశిష్టతను చాటిచెబుతూ ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై తొలిరోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి. ఆధునిక సమాజం సంబంధ బాంధవ్యాలు దూరమవుతున్న తరుణంలో అన్నాచెల్లెల అనుబంధం గొప్పతనాన్ని చాటుతూ అమృతహస్తం నాటికను ప్రదర్శించారు. అన్నాచెల్లెల మధ్య అప్యాయత, అనురాగాలను చక్కగా వివరించారు. చెల్లెలి వివాహ జీవితం ఇబ్బందుల్లో పడి ఆమె భర్త వేధిస్తుంటే తన ఇంటికి తీసుకువచ్చి చూసుకోవడం, అన్న, చెల్లెలు కలిసి బావకు బుద్ధిచెప్పడం ఇతివృత్తంగా నాటిక సాగింది. గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. మనిషి జీవితం బంధంతో మొదలవుతుందంటూ అందులోని గొప్పతనాన్ని చాటిచెబుతూ ప్రదర్శించిన బంధం నాటిక సందేశాత్మకంగా సాగింది. తల్లిదండ్రులు, తోడబుట్టిన వాళ్లు, మిత్రులు, గురువులు, శ్రేయోభిలాషులు, పెళ్లి తర్వాత భార్యాభర్తలు, బిడ్డలు ఇలా ఎన్నో బంధాలు జీవిత చరమాంకం వరకూ ఉంటాయి. ఇందులో భార్యా భర్తల బంధం విశిష్టమయినది. ఎన్ని అవాంతరాలు ఎదురయినా పటిష్టంగా ఉండాలి తప్ప దారి తప్పిన ఆలోచనలతో దానిని విచ్ఛిన్నం చేసుకుంటే వచ్చే ఇబ్బందులను ఈ నాటిక ద్వారా తెలియజెప్పారు. విజయవాడ మైత్రి కళానిలయం కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను మాడుగుల రామకృష్ణ రచించగా, టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 17: కోనసీమ తిరుమల వాడపల్లి గోవిందనామస్మరణతో మార్మోగింది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగంను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి తలనీలాలు, తులభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.44.90 లక్షలు లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, డిప్యూటీ కమిషనర్, ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ తెలిపారు.

నేటి నుంచి కుంతీమాధవుని కల్యాణోత్సవాలు



పిఠాపురం, ఫిబ్రవరి 17: దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒక్కటైన కాకినాడ జిల్లా పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయం కల్యాణోత్సవాలకు సిద్ధమైంది. ఇంద్రుడు దేశంలో అయిదు ప్రాంతాల్లో మాధవ క్షేత్రాలను ప్రతిష్ఠించగా అందులో పిఠాపురం ఒక్కటని, పాండవుల తల్లి కుంతీదేవితో పూజలు అందుకుని కుంతీమాధవుడిగా విరాజిల్లుతున్నట్లు పండితులు చెబుతారు. కుంతీమాధవుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలు 25వ తేదీ వరకూ జరగనున్నాయి. 18న ఉదయం పంచామృతాభిషేకం, రాత్రి ధ్వజారోహణం, విష్వక్సేనుల వారి గ్రామోత్సవం, 19న చక్రపెరుమాళ్ల గ్రామోత్సవం, స్వామి ఉత్సవులకు అలంకార తిరుమంజనం, కల్యాణాలంకారం, 20న పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, సాయంత్రం గజవాహనంపై గ్రామోత్సవం, రాత్రి స్వామి కల్యాణం, 21న ఉదయం, సాయంత్రం శేష, గరుడ వాహనాలపై గ్రామోత్సవం, 22న పొన్నవాహనంపై గ్రామోత్సవం, 23వ తేదీ రాత్రి రథోత్సవం, 24న ఉప్పాడ సముద్రం వద్ద స్వామికి చక్రస్నానం, అన్నసమారాధన, రాత్రి ఆలయంలో చోర సంవాదం, 25వ తేదీన పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు, రాత్రి శ్రీపుష్పయాగం జరుగుతాయి. ప్రతిరోజూ వేద పారాయణం జరుగుతుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు, కుంతీ మాధవ భక్తబృందం సభ్యులు తెలిపారు.

22న రత్నగిరిపై సరస్వతి పూజ

అన్నవరం, ఫిబ్రవరి 17: ఇంటర్, పదో తరగతి, ఇతర ముఖ్యమైన పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు ఈనెల 22న సరస్వతి పూజను నిర్వహించనున్నట్లు రత్నగిరి ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. విద్యార్థులచే సరస్వతి పూజను చేయించి కలములు, కంకణాలను అందించనున్నామన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

స్థలాలు లేని పట్టాలెందుకు?

- తక్షణమే స్థలాలు చూపాలని మహిళల ధర్నా
- కడియం తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- రెండు గంటల పాటు ఆందోళన
- రోడ్డుపై భారీగా నిలిచిన ట్రాఫిక్
- సమస్య పరిష్కరిస్తామని జేసీ తేజ్‌భరత్ హామీ



రోడ్డుపై బైఠాయించిన మహిళలు



తహసీల్దార్ రమాదేవితో చర్చలు

కడియం, ఫిబ్రవరి 17: 'వైసీపీ ప్రభుత్వం జగనన్న పట్టాలు ఇచ్చి నాలుగేళ్లు దాటింది.. పట్టాలిచ్చారు కానీ నేటికీ స్థలాలు చూపలేదు. అద్దె ఇళ్లలో ఉంటున్నాం.. అదిగో స్థలం.. ఇదిగో పట్టా అంటూ మోసగిస్తున్నారు కానీ ఇళ్ల స్థలాలు చూపలేదు' అని కడియం మండలం వేమగిరి తోట, గట్టు, వేమగిరి గ్రామాలకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రెండు గంటల పాటు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిత్యం రద్దీగా ఉండే వేమగిరి-కాకినాడ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. సమస్య పరిష్కరిస్తేనే కానీ కదిలేది లేదని స్పష్టం చేశారు. మండలంలో వేరే వేరే ఊర్లు వారికి స్థలాలు ఇచ్చారు. ఊరిలో ఉండే తమకు ఇవ్వలేదని వాపోయారు. శనివారం ఉదయం స్థలాలు ఇస్తున్నామంటూ పిలిచి రాళ్ల వద్ద ఉండమని పట్టాపై నెంబర్ ఇచ్చారని దాని కోసం రూ. 150 చొప్పున తీసుకున్నారని చెప్పారు. అలానే రాళ్లకు రూ. 400 చొప్పున తీసుకున్నారన్నారు. ఇళ్ల స్థలాలు ఇస్తారేమో అని గత కొద్దిరోజులుగా ప్రతి రోజు పనులు మాని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఏమి ప్రయోజనం లేదన్నారు. సుమారు 800 కుటుంబాలను పట్టాలు ఆశ చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కార్యాలయాల చుట్టు తిప్పుకుంటున్నారన్నారు. జగనన్న లేఅవుట్‌లో సుమారు 20 ఎకరాల జిడ్పీ భూమిని లేఅవుట్‌గా కేటాయించి నాలుగేళ్ల కిందట సుమారు 800 మంది లబ్ధిదారులను గుర్తించి పట్టాలు ఇచ్చారన్నారు. సాంకేతిక కారణాలు చూపి పట్టాలున్న వారికి స్థలాలు ఇవ్వకుండా జాప్యం జరుగుతుందన్నారు. ఆందోళన ఉధృతంగా మారుతుందనే సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ బి.రమాదేవి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు తమకు న్యాయం చేయాలని లేకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో తహశీల్దార్ రమాదేవి కొంతమంది ప్రతినిధులను కార్యాలయంలోకి రమ్మని వారితో మాట్లాడారు. అనంతరం ఐదుగురు తహశీల్దార్‌తో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లగా అక్కడ జేసీ తేజ్‌భరత్ వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపి న్యాయం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటించారు. ఆందోళన కార్యక్రమంలో నల్లా వరలక్ష్మి, డి.సాయిలక్ష్మి, ఎస్.పద్మావతి, స్వర్ణలత, జోగి మల్లేశ్వరి, భోగిరెడ్డి జ్యోతి, ఇసుకపూడి వెంకటలక్ష్మి, ఇసుకపూడి సత్యవతి, నాగదేవి, ఈడేపల్లి దివ్య, పడాల శ్రీదేవి, పితాని సూర్యకుమారి, ఆకుల సత్యవేణి, ఈత మంగాదేవి, పార్వతి, నూకల లక్ష్మి, కోనే పద్మావతి, అల్లం వెంకటేశ్వరావు, షేక్ రెహమాన్, జ్యోతి, నాగిరెడ్డి, దేవి, జి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు ఉంటూ దొంగతనాలు

కడియం, ఫిబ్రవరి 17: అద్దెకు ఉంటూ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని కడియం పోలీసులు పట్టుకున్నారు. సీఐ బి.తులసీధర్ వివరాల ప్రకారం... రాజమహేంద్రవరం నల్లమందు సందులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. అతడిని విచారించగా పెరవలి మండలం ఖండవిల్లికి చెందిన పల్లెపు విజయకుమార్‌గా గుర్తించామన్నారు. అతడు 2, 3 నెలల కొకసారి ఊర్లు మారుతూ ఇంటి ఓనర్లతో, చుట్టుపక్కల వారితో స్నేహం చేసి వారిని మభ్యపెట్టి వారింట్లో దొంగతనాలకు పాల్పడుతుంటాడన్నారు. అలాగే వేమగిరిలో దొడ్డా ఉమాపార్వతి బంధువుల ఇంటికి 3నెలల క్రితం అద్దెకు వచ్చి వారింట్లో సుమారు రూ.2 లక్షల బంగారం దొంగిలించుకుపోయాడన్నారు. అతనిపై తెనాలి, విశాఖపట్నంలో కూడా కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచినట్లు చెప్పారు.

కోట సత్తెమ్మ ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా హరి

నిడదవోలు, ఫిబ్రవరి 17: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం(శివ)ను సామర్లకోటలోని కుమార భీమేశ్వరస్వామి ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా బదిలీ చేశారు. కోట సత్తెమ్మ ఆలయాన్ని అసిస్టెంట్ పరిధిలోకి తీసుకురావడంతో అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న హరి సూర్యప్రకాష్‌ను కోట సత్తెమ్మ ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలో బాధ్యతలు స్వీక రించనున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1.58 లక్షలు

మామిడికుదురు, ఫిబ్రవరి 17: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని వారికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,58,509 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. స్వామివారిని 2,863మంది దర్శించుకుని 2,095మంది అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం

బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి వెదురుపాకకు చెందిన వాకపల్లి సూర్యనారాయణమూర్తి, వాన వెంకటసూర్యచంద్రరావు కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

బావిలో మహిళ మృతదేహం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 17: ఈనెల14న అదృశ్యమైన ద్రాక్షారామ బియ్యంపేటకు చెందిన వివాహిత మృతిచెందింది. ఆమె మృతదేహం శనివారం ఓ బావిలో కనిపించింది. బియ్యంపేటకు చెందిన దొంగల వరలక్ష్మి (30) ఈనెల 14 తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదు. భర్త నరసింహమూర్తి, కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలింపు చేపట్టారు. ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శుక్రవారం రాత్రి వరలక్ష్మి అదృశ్యంపై కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం బెస్తపేట సమీపంలో బావిలో వరలక్ష్మి మృతదేహం కనిపించింది. ఎస్ఐ సురేంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ సురేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

రామచంద్రపురం, ఫిబ్రవరి 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నకిలీ నోట్ల ముఠాను శనివారం పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రామకృష్ణ వెల్లడించారు. చెడు వ్యసనాలకు, ఈజీ మనీకి అలవాటు పడ్డ మాగంటి గోపి, బోయ గోవిందరావు, వాసంశెట్టి వీరభద్ర రఘురాం, బడుగంటి వీరవెంకటరమణలు ముఠాగా ఏర్పడ్డారు. వారికి విజయనగరం జిల్లా గూడుపువలసకు చెందిన చల్లా నూకరెడ్డి, విజయనగరం జిల్లా శాంతినగర్‌కు చెందిన మీసాల అప్పలరాజులు నకిలీ నోట్ల తయారీకి కావలసిన సామగ్రిని అందిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన బోయి గోవిందరావు ఈ సామగ్రిని రామచంద్రపురానికి చేరవేస్తున్నాడు. రామచంద్రపురం పట్టణం రత్నంపేటకు చెందిన మాగంటి గోపి, రామచంద్రపురం మండలం నరసాపురపుపేటకు చెందిన బడుగంటి వీరవెంకటరమణ, రాయవరం మండలం వెంటూరుకు చెందిన వాసంశెట్టి వీరభద్రరఘురామ్‌లు రామచంద్రపురంలో రత్నంపేటలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ నోట్లు ముద్రిస్తున్నారు. రద్దీగా ఉండే రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో నకిలీ నోట్లు చలామణి చేస్తున్నారు. ఏడాది కాలంగా నకిలీ నోట్లు ముద్రణ, చలామణి చేస్తున్నారు. నకిలీ ముద్రణలో బోయి గోవిందరావు కూడా సహకరిస్తున్నాడు. పోలీసులకు అందిన సమాచారంతో శనివారం ఎస్పీ శ్రీధర్‌బాబు ఆదేశాలతో డీఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది ఆ ఇంటిపై దాడి చేసి నకిలీ నోట్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మాగంటి గోపి, బడుగంటి వీరవెంకటరమణ, వాసంశెట్టి వీరభద్రరఘురామ్, బోయి గోవిందరావులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.75,000 నకిలీ నోట్లు, రెండు ప్రింటర్లు, నకిలీ నోట్ల ముద్రణకు వాడే ఎ4 కాగితాల కట్ట, వాటర్‌మార్కు, ధారం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. విజయనగరం జిల్లాకు చెందిన చల్లా నూకరెడ్డి, మీసాల అప్పలరాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ దొరరాజును, ఎస్ఐ సురేష్‌బాబుని, పోలీసు సిబ్బందిని ఎస్పీ శ్రీధర్, డీఎస్పీ బి.రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

రత్నగిరిపై పెళ్లిసందడి

అన్నవరం, ఫిబ్రవరి 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి శనివారం పెళ్లి భాజాలతో హోరెత్తింది. మాఘమాసంలో శనివారం బలమైన ముహూర్తాలు రాత్రి 11.30, వేకువజామున 3.30 నిమిషాలు కావడంతో స్వామివారి సాక్షిగా వివిధ ప్రాంతాలలో జరిగిన వివాహాలతో సుమారు 200 జంటలు ఒక్కటయ్యాయి. సత్రం గదులు సరిపడకపోవడంతో పెండ్లిబృందాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివాహ బృందాల కోసం ఉచిత కల్యాణ మండపాలు, విష్ణుసదన్ హాల్స్, సీతారామ సత్రం, పాత, కొత్తసెంటినరీ కాటేజీలు, ఆలయ ప్రాంగణంలో వివాహాలు జరిగాయి. వివాహాలు చేయించే పురోహితులు, భాజాభజంత్రీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఆలయ ప్రాంగణమంతా వివాహ బృందాలతో రద్దీగా మారింది. ఆదివారం ఉదయం స్వామివారి సన్నిధికి విశేషంగా భక్తులు, నవదంపతులు విచ్చేయనుండడంతో అధికారులు వారికి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

జాతీయ స్థాయికి ఎంపికైన తొండవరం విద్యార్థుల ప్రాజెక్టు



జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు ఇదే..

అంబాజీపేట, ఫిబ్రవరి 17: జైపూర్‌లో మినిస్ట్రీస్ ఆఫ్ ఎడ్యుకేషన్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెర్స సంస్థ నిర్వహించిన ఎస్ఐసీ ఇన్నోవేషన్ కాంటెస్టులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. జాతీయ స్థాయికి ఏపీ తరుపున ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఒకే ఒక ప్రాజెక్టు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం పీవీ కేశవాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి కొబ్బరి పీచుతో తయారు చేసిన కోకోనట్ క్వాయర్ కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టును పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గణేష్ నరసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఎస్.శ్రీరామ్, ఎం.నమిత, ఎం.పార్వతి రూపొందించి శనివారం ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులు 24 ఎంపిక చేయగా వాటిలో తొండవరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టును ఎంపిక చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, జిల్లా సైన్సు అధికారి సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

గుర్తుతెలియని బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

రాయవరం, ఫిబ్రవరి 17: సోమేశ్వరం-కుతుకులూరు రోడ్డులో ఇటుక బట్టీ సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో వృద్ధుడు మృతి చెందాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన పులగం ధర్మారెడ్డి(70) కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి కూలీ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా వృద్ధుడిని మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న దంపతులు ఢీకొట్టడంతో అతడు మృతిచెందాడని, రోడ్డు పక్కనే వృద్ధుడిని పడుకోబెట్టి దంపతులు వెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. స్థానిక ఇటుక బట్టీ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. రాయవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- చెల్లూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ
- టీడీపీ అధికారంలోకి వస్తే చేసే పనులపై ప్రచారం

పొదుపు, రుణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 17: బ్యాంకులు అందించే పొదుపు, రుణ, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వెంకటనరసింహ తెలిపారు. పి.గన్నవరంలో ఏర్పాటుచేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. సైబర్‌క్రైమ్స్ ఎక్కువగా జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ పర్‌సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కౌన్సిలర్లు మణికంఠ, ప్రసాద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలంటూ ధర్నా



ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ ముమ్మిడివరం తాలూకా జేఏసీ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో ధర్నా, ర్యాలీ, నిరసన దీక్ష నిర్వహించారు. తాలూకా పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ముమ్మిడివరం తరలివచ్చి తహసీల్దార్ కార్యాలయం నుంచి కాశివానితూము వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల సమైక్యాంధ్ర ఉద్యమ శిబిరంలో ఏర్పాటుచేసిన ధర్నా శిబిరాన్ని పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు రెడ్డి వీరాస్వామి ప్రారంభించారు. జేఏసీ తాలూకా అధ్యక్షుడు సుంకర శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన ఉపాధ్యాయ, ఉద్యోగ కార్మికులు పాల్గొన్నారు. 30శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని, 2018 నుంచి ఇప్పటి వరకు చెల్లించాల్సిన బకాయిల మొత్తాన్ని విడుదల చేయాలని, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్‌లు, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో జనిపల్లి సత్యనారాయణ, కోలా కృష్ణ, టి.దుర్గాప్రసాద్, శీలారపు శ్రీనివాసరావు, పి.హిమబిందు, సీహెచ్ చిట్టిబాబు, ఎం.శ్రీనివాసరావు, పి.వెంకట్రాజు, పి.డేనియల్, వి.బాబాయి, యు.దశరథరామయ్య, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా

రాజోలు, ఫిబ్రవరి 17: ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు శనివారం ధర్నాచేశారు. ఉద్యోగులకు రావాల్సిన ఎస్ఎల్, జీపీఎఫ్ లోన్లు, డీఏ బకాయిలు తక్షణం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యూటీఎఫ్, ఎస్టీయూ, పీఆర్టీయూ, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, రెవెన్యూ, ఏపీఎన్జీవోఎస్, ట్రెజరీ, ఎస్ఆర్ క్లాస్-4 ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి

కొత్తపేట, ఫిబ్రవరి 17: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు డిమాండ్ చేశారు. శనివారం జేఏసీ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను గడువులోపు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. జేఏసీ మండల అధ్యక్షుడు ఎం.రామారావు, సహ చైర్మన్ వై.సత్తిరాజు, కన్వీనర్ నల్లా వెంకటరామారావు, వైస్ చైర్మన్ కేవీసీహెచ్ సూర్యారావు, ఆచంట రామచంద్రప్రసాద్, ఏవీ సుబ్బారావు, టి.విజయకృష్ణ, జి.రామ్‌కుమార్, బి.శేషగిరిరావు, బి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబాటు





రాయవరం: చెల్లూరులో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల, రాజోలు: మాట్లాడుతున్న మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు

రాయవరం, ఫిబ్రవరి 17: చెల్లూరులో శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక యర్రమట్టిపురం, గంగిరెద్దుల కాలనీ, వీవర్స్‌కాలనీ, కృష్ణమ్మచెరువు, బత్తులవారి సావరంలో ఆయన పర్యటించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేన కూటమికి పట్టం కట్టాలన్నారు. చంద్రబాబు ఇచ్చిన ఆరు గ్యారంటీలన వేగుళ్ల ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రు వీరాజు, టీడీపీ నేతలు వైఆర్కే పరమహంస, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నూనె ఏసుబాబు, మోరంపూడి రాజ్‌కుమార్, మాజీ జడ్పీటీసీలు కాదా ప్రభాకరరావు, కర్రి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకన్నబాబు, పీతల రవి, కొప్పిశెట్టి సత్యనారాయణ, దార్ల సుధీర్, కురుపడి రాజు, దంగేటి సత్యనారాయణ, కొవ్వూరి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 17: వైసీపీ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం అథోగతి పాలైందని, ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వమేఅధికారంలోకి వస్తుందని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఎన్నో రకాల మాఫియాలకు నిలయంగా జగన్ మార్చేశారని విమర్శించారు. తాండవపల్లిలో శనివారంబాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, నాయకులు పొలమూరి ధర్మపాల్, కర్రి రామస్వామి, పెచ్చెట్టి విజయలక్ష్మి, మట్టా మహాలక్ష్మీప్రభాకర్, దెందుకూరి సత్తిబాబురాజు, బొర్రా ఈశ్వరరావు, కైరం రాము, పరమట శరత్‌బాబు, కైరం సత్తిబాబు, నంద్యాల దొరబాబు, రాజులపూడి భీముడు, దంతులూరి వాసురాజు, మాకిరెడ్డి పూర్ణిమ, అధికారి బాబ్జీ, మంద గెద్దయ్య పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే

రాజోలు, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో బీసీల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జయహో బీసీ ర్యాలీలో ముఖ్య అతిథిగా గొల్లపల్లి సూర్యారావు, పరిశీలకులుగా చిటికెల రామ్మోహనరావు పాల్గొన్నారు. తాటిపాకలో గొల్లపల్లి స్వగృహం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ తాటిపాక సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మామిడికుదురు, గెద్దాడ, రాజోలు మండలం వేగివారిపాలెం, కడలి ములికిపల్లి, కూనవరం, చింతలపల్లి, శివకోటి, రాజోలులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి జయహో బీసీ ర్యాలీ సోంపల్లి, పొదలాడ, తాటిపాక మఠం మీదుగా గొల్లపల్లి స్వగృహానికి ర్యాలీ చేరుకుంది. అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గొల్లపల్లి మాట్లాడుతూ చేనేత కార్మికులకు టీడీపీ హయాంలో ఇచ్చిన తొమ్మిది పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసి చేనేతను నాశనం చేశారని ధ్వజమెత్తారు. ఎంపీపీ కేతా శ్రీను, పిల్లి శ్రీరామమూర్తి, కాండ్రేగుల సత్యనారాయణ, బందెల పద్మ, కాండ్రేగుల భవానీ, మానుకొండ దుర్గాప్రసాద్, సాయి పాపయ్యరాజు, ఈలి శ్రీనివాస్, యెనుముల నాగు, కౌరు శ్రీనివాస్, అంతర్వేదిపాలెం పుల్లయ్య, పితాని సూరిబాబు, కొల్లు మహాలక్ష్మి, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, గాలిదేవర వెంకన్నబాబు, చిట్టూరి సంతోష్, గుబ్బల విక్రమ్ పాల్గొన్నారు.

టీడీపీపై నమ్మకంతోనే పార్టీలో చేరికలు





రావులపాలెం: టీడీపీలో చేరిన వారికి కండువాకప్పి ఆహ్వానిస్తున్న బండారు సత్యానందరావు, ఏడిద గ్రామస్థులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రావులపాలెం, ఫిబ్రవరి 17: టీడీపీ అధికారంలోకి వస్తే పేదలతో పాటు అన్ని వర్గాలు అభివృద్ధి పథంలో నడుస్తాయన్న నమ్మకంతో కొత్తపేట నియోజకవర్గంలో టీడీపీలో రోజు రోజుకూ చేరికలు పెరుగుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం రావులపాలెం, ఆలమూరులకు చెందిన కొరకోటి ఆనందరావు, రామకృష్ణ, పెందుర్తి రాజా, కొముజు సుకుమార్, జోగి ఉషాకుమారి పార్టీలో చేరారు. వారికి బండారు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల రామారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

మండపేట, ఫిబ్రవరి 17: ఏడిద గ్రామానికి చెందిన పలువురు శనివారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన గిడుతూరి వీరబాబు, తంగెళ్ల దుర్గాప్రసాద్, ఉడతా నాగబాబులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ, జనసేన కూటమి సిద్ధాంతాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు.

నేడు వంతుల వారీగా సాగునీరు

అంబాజీపేట, ఫిబ్రవరి 17: ముక్కామల లాకుల ద్వారా సాగు చేసే భూములకు ఆదివారం, సోమవారం వరకు 24గంటల పాటు వంతులవారీగా సాగునీరు అందిస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ నవీన్‌కుమార్ తెలిపారు. నేదునూరు, మోడేకుర్రు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, సావరం గ్రామాల రైతులు పంటబోదెలను శుభ్రం చేసుకుని సాగునీరు పూర్తిస్థాయిలో అందేలా చూసుకోవాలన్నారు. సోమవారం ఉదయం 6గంటల వరకు వంతులు వారీగా సాగునీరు అందిస్తామన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

మలికిపురం, ఫిబ్రవరి 17: మాతా, శిశు సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో పాటు పడుతున్నాయని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. పడమటిపాలెంలో రూ.12లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.5లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించు సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సీడీపీవో వైకేడీ రమాదేవి, సర్పంచ్ ఆకుల మాధవీనాగలక్ష్మి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, అడబాల బ్రహ్మాజీ, సుంకర బాబ్జి, నల్లి శివ, ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు పాల్గొన్నారు.

దేవస్థానంలో అవుట్ పోలీసుస్టేషన్..

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదురుగా రథం షెడ్డు పక్కన పోలీసు కంట్రోల్ రూము(అవుట్ పోలీసుస్టేషన్) ఏర్పాటు చేసినట్టు సీఐ గోవిందరాజు తెలిపారు. తీర్థ మహోత్సవాలకు కంట్రోల్ రూమ్ ద్వారా సేవలందిస్తామని, 365రోజులు కూడా ఈఅవుట్ పోలీసుస్టేషన్ సేవలందించేలా ఓపీ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ ఎస్.రాముపాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి నగదు సాయం

అంబాజీపేట, ఫిబ్రవరి 17: కిడ్నీవ్యాధితో బాధపడుతున్న బళ్ళ రామయోచనకు అంబాజీపేట ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వైద్య ఖర్చు లకు రూ.12,300 అందించినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 17: అంగరలో ఉన్నశ్రీఅలివేలు మంగ గోదాదేవి సమేత శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి వారి నవమి బ్రహ్మోత్సవాలు ఈనెల19 నుంచి 21వరకు జరుగుతాయని ఆలయ చైర్మన్ దాసరి లక్ష్మణమూర్తి, వైస్ చైర్మన్ సూరంపూడి వెంకట్రావు తెలిపారు. 19నతిరుమంజనసేవ, విశేషార్చన, 20న యాగశాల అర్చన, సుదర్శనహోమం, 21కొట్నాల ఉత్సవం, శ్రీచక్రస్నానంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగుస్తాయన్నారు. 20న అన్నసమారాధన నిర్వహిస్తామని కార్యదర్శి పెద్దింశెట్టి రామస్వామి, సభ్యులు తెలిపారు.

గవర్నర్ కార్యాలయానికి ఓఎన్జీసీ ఫైల్

● ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, ఫిబ్రవరి 17: యానాంలో ఓఎన్జీసీ చమురు సంస్థ నుంచి మత్స్యకారులకు ఇవ్వలసిన నష్టపరిహారం జీవో ఫైల్ పుదుచ్చేరి గవర్నర్ కార్యాలయానికి చేరిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. శనివారం సాయంత్రం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిహారానికి సంబంధించి వారం రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. పరిహారం విషయంలో ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆపలేరన్నారు. ఇప్పటికే ఈజీవో ఫైల్ ముఖ్యమంత్రి, మంత్రి, ఉన్నతాధికారులు ఆమోదంతో గవర్నర్ కార్యాలయానికి చేరిందన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమచేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అయితే ఎన్నికల తేదీనాటికి పరిహారం అందకుంటే రానున్న ఎన్నికల్లో తీసుకునే నిర్ణయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తానని సమావేశంలో మల్లాడి వివరించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కొనా కొండబాబు, తీరుకోటి నాగేశ్వరరావు, మత్స్యకార నాయకుడు మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నేతలకు నోటీసులు

పి.గన్నవరం, ఫిబ్రవరి 17: చలో విజయవాడ నేపథ్యంలో మండలంలోని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలకు పోలీ సులు నోటీసులు అందించారు. యూటీఎఫ్ మండల అధ్య క్షుడు డి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, ఎస్టీయూ అధ్యక్షుడు నల్లా బాలాజీ, యూటీఎఫ్ నాయకులు పేపకా యల చంద్రరావులకు పోలీసులు నోటీసులందించి స్టేషన్‌కు రావాలని సూచించారని నేతలు తెలిపారు. చలో విజయవాడకు అనుమతులులేవని నిబంధనలు ఉల్లంఘిస్తేచట్ట రీత్యానేరమని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నట్లు వారు తెలిపారు.

ఉపాధ్యాయుడికి నోటీసు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 17: 'ఓట్ ఫర్ ఓపీఎస్'లో పాల్గొనేందుకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయవాడ వెళ్లకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. ఉపాధ్యాయుడు గూడపాటి మాణిక్యాలరావుకు నోటీసు ఇచ్చి విజయవాడ సభకు వెళ్లరాదని హుకుం జారీ చేశారు.

కల్యాణోత్సవాల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలి



కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి

అంతర్వేది, ఫిబ్రవరి 17: దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి అన్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కల్యాణోత్సవ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత కల్యాణ మండపం, భక్తులు కూర్చొనే బ్లాకులు, దర్శన క్యూలైన్లు, రథం రోడ్డు, యాత్రికుల వసతిగదులు, బస్టాండు, సముద్రస్నానాల దుస్తులు మార్చుకునే ప్రదేశాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సేవా భావంతో భక్తులకు అధికారులంతా సేవలు అందించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆదివారం సాయంత్రానికి తెప్పోత్సవం నిర్వహించే మంచినీటి చెరువు పూర్తవ్వాలని, సోమవారం ఉదయానికల్లా కల్యాణోత్సవ ఏర్పాట్లలో లోటు పాట్లు లేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. భక్తులు స్వామివారి కల్యాణం తిలకించే స్క్రీన్లు, భక్తుల భద్రత, బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పెద్దిరాజు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, సీఐ గోవిందరాజు, ఎస్ఐ రాము, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది జనసేన, టీడీపీ కూటమి పాలనే

అల్లవరం, ఫిబ్రవరి 17: జగన్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘన విజయం సాధించడం తథ్యమని జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు అన్నారు. మహాసంకల్ప యాత్రలో 102వ రోజైన శనివారం ఆయన అల్లవరంలో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో కంకిపాటి వీరబాబు, సందాడి శ్రీనుబాబు, చికిలే చిట్టిబాబు, మోకా బాలయోగి, ఆర్.నాగేశ్వరరావు, పిల్లా ప్రసాద్, కామిశెట్టి వెంకటరత్నం, కంకిపాటి సుబ్బరావు, అరుణ్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు అర్హులందరికీ అందాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 17: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని బీజేవైఎం ఆర్టీఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ యల్లమిల్లి నాగసుధాకొండలరావు కోరారు. పట్టణంలోని 2,3,5,6వార్డుల్లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను కొండ వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్లు యేడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, ఆశెట్టి ఆదిబాబు, పిండి రాజా తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 17: వరిలో ముదురు ఆకులు పసుపు రంగు ఆకులుగా మారితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి చేలను పరిశీలించి అనంతరం మాట్లాడారు. పలువరిచేలల్లో పసుపు రంగుగా మారిన ఆకులను గుర్తించారు. నివారణకు 20కిలోల పొటాష్, 5కిలోల యూరియాలో కలిపి చల్లాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.కళ్యాణ్‌సూర్యకుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈసారి రెండో పంటకు ఎంటీయూ-1121, ఎంటీయూ-3626 రకాలను ఎంపిక చేసు కుని 6100ఎకరాల్లో రైతులు నాట్లు పూర్తిచేశారన్నారు. అధికారులు వెంట వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

వెదురుపాకలో ఘనంగా లక్ష బిల్వార్చన

రాయవరం, ఫిబ్రవరి 17: వెదురుపాక పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన పూజ శనివారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ తాడి బుల్లి వెంకటరెడ్డి దంపతులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకుడు యలమంచలి సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో వేదపండితులు స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పార్వతి అమ్మవారికి కుంకుమార్చనలు జరిపారు. గ్రామానికి చెందిన వెయ్యి మంది భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. తాడి వెంకటరెడ్డి, ధనలక్ష్మి దంపతులు, తాడి శ్రీనివాసరెడ్డి, గిరీశ దంపతులు, సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 17: మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని పూణేలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన అక్కాచెల్లెళ్లు మహబూబ్ షాహీరా, షకీలా అద్భుత ప్రతిభ చాటి పతకాలు సాధించారు. హైజంప్‌లో షాహీరా రజత పతకాన్ని దక్కించుకుంది. షకీలా హైజంప్‌లో బంగారు, పోల్‌వాల్ట్‌లో రజత పతకాలు సాధించింది. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ధరమ్‌వీర్ ధిల్లాన్, ప్రధాన కార్యదర్శి డి.డేవిడ్‌ప్రేమ్‌నాథ్ నుంచి పతకాలు అందుకున్న అక్కాచెల్లెళ్లను క్రీడాభిమానులు అభినందించారు.

చిందాడమడుగును పరిరక్షించాలి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 17: అతి పురాతనమైన చిందాడమడుగు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కామాక్షీ పీఠాధిపతి కామేశమహర్షి కోరారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌లో భాగంగా కొత్త ఎలైన్‌మెంట్‌లో చిందాడమడుగును చేర్చడంపై ఆవేదనవ్యక్తంచేశారు. చిందాడగరువులో పుష్కరాల స్నానఘట్టంగా నిలిచిన చిందాడమడుగును భవిష్యత్తులో భక్తుల సౌకర్యార్థం తీర్చిదిద్దాలని కోరారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 8ఎకరాల్లో చిందాడ మడుగు ఉందని అధికారులు చెప్తున్నారని, అయితే ప్రస్తుతం 3ఎకరాల్లో మాత్రమే ఉందన్నారు. 2027లోజరిగే గోదావరి పుష్కరాలకు చిందాడమడుగును అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయమూర్తి షర్మిళ మృతికి పలువురు సంతాపం



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 17: గురజాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అమలాపురం పట్టణానికి చెందిన వేగేశ్న షర్మిళ (దంతులూరి షర్మిళ) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. అమలాపురంలో విద్యాభ్యాసం చేసిన షర్మిళ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో ప్రాక్టీసు చేస్తూ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై సమర్థవంతమైన సేవలు అందించారు. ఆమెకు భర్త రాజారమేష్‌తో పాటు కుమారుడు కృష్ణతేజ ఉన్నారు. కుమార్తె మృతితో విషాదంలో వున్న విశ్రాంత మున్సిపల్ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ దంతులూరి వెంకటేశ్వరరాజు-సూర్యకాంతం దంపతులను పలువురు ప్రముఖులు పరామర్శించి ఓదార్చారు.

కర్బలా యాత్రతోనే జీవిత పరమార్థం

మామిడికుదురు, ఫిబ్రవరి 17: కర్బలా యాత్రతోనే జీవితం పరమార్థమవుతుందని మత ప్రబోధకులు సయ్యద్ అబ్బాస్ బాకరి, షబ్బర్ అలీజైదీలు పేర్కొన్నారు. నగరం గ్రామంలోని మంజిలే కర్బలాలో అంజుమానే ఘాజీఅబ్బాస్ భక్త బృందం ఆధ్వర్యంలో నిరుపేద భక్తులకు కర్బలా యాత్రకు పంపించే నిర్దేశంతో ఏర్పాటుచేసిన టిక్కెట్లను శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మత ప్రబోధకులు మాట్లాడుతూ ముస్లింగా పుట్టడమే తాము చేసుకున్న పూర్వజన్మ సుకృతమని, ప్రతీ ముస్లిం జీవితంలో ఒకసారి కర్బలా యాత్రకు వెళ్లాలని ఉద్బోధించారు. ప్రతీ సంవత్సరం నలుగురు పేద యాత్రికులను కర్బలా పంపించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సంఘ అధ్యక్షుడు అబేద్‌అలీ, సయ్యద్ రూహీ, గుల్షన్, సర్కిల్‌ఫకార్ సాహెబ్ పాల్గొన్నారు.

విలసవిల్లిలో మహా సౌరయాగం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 17: విలసవిల్లిలోని శ్రీరామ మందిరంలో శనివారం నక్షత్ర నవగ్రహపూర్వక మహా సౌరయాగం నిర్వహించారు. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సూర్యారాధన జరిగింది. శ్రీచక్రార్చన, చండీహోమం, రాజశ్యామల హోమం జరిగాయి. యర్రమిల్లి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో పవన్‌శర్మ, కిషోర్‌శర్మ, ఆదిత్యశర్మ, కార్తీక్‌శర్మ బ్రహ్మత్వంలో సౌర అష్టాక్షరీ జపాలు, సూర్యనమస్కారాలు, త్రిచ అర్ఘ్యాలు జరిగాయి.

రైతు నాయకుడు అన్నందేవుల మృతి



ఆలమూరు, ఫిబ్రవరి 17: బడుగువానిలంక గ్రామానికి చెందిన రైతు నాయకుడు అన్నందేవుల వీరరాఘవులు(87) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగుతున్నారు. ఆలమూరు ఎమ్మెల్యేలు వల్లూరి నారాయణరావు,వీవీఎస్ఎస్.చౌదరిలతో సన్నిహితంగా ఉండే వీరరాఘవులు బడుగువానిలంకలో సీలింగ్ భూములు పేదలకు అందించడంలో కీలకపాత్ర పోషించారు. గ్రామపంచాయతీ వార్డు సభ్యునిగా పనిచేశారు. ఆయనకు భార్య కుమార్తు, కుమార్తె ఉన్నారు.

ప్రతిష్ఠ పూజలు

కె.గంగవరం, ఫిబ్రవరి 17: కూళ్ల శివారు తమ్మయ్యపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. విగ్రహదాత చిట్టూరి రాజబాబు, విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

టీడీపీలో భారీగా చేరికలు



కె.గంగవరం, ఫిబ్రవరి 17: కోట గ్రామంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను) సమక్షంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. తొలుత శ్రీను గ్రామంలో పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకోవాల్సిన అవసరం గురించి వివరించారు. చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. పార్టీలో చేరే వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ములకల రామచంద్రరావు, కోటి పల్లి ఉప సర్పంచ్ తమ్మా చిన్న, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం ప్రారంభం

మలికిపురం, ఫిబ్రవరి 17: మలికిపురం యూనియన్ బ్యాంకు సౌజన్యంతో మలికిపురంలో ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాన్ని శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూరల్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ నీలేష్ ప్రారంభించారు. బ్యాంకు అందించే పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజబాబు, ఇమాయియేలు, అరుణ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17: బ్యాంకు లావాదేవీల్లో సైబర్ క్రైమ్ ఎక్కువగా జరుగుతున్నందున అంతా ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాల సేవలను వినియోగించుకుని చైతన్యవంతులు కావాలని ముమ్మిడివరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్‌బ్యాంకు బ్రాంచి మేనేజర్లు బి.అచ్చిరాజు, వై.శ్రీధర్‌లు పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఫణీంద్ర, కౌన్సిలర్ ఎం.శ్రీనివాస్, మైథిలిలు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

అల్లవరం, ఫిబ్రవరి 17: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సక్రమంగా జరిగేందుకు సహకరించాలని అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ కోరారు. యెంట్రుకోన పంచాయతీ వద్ద సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన ఎన్నికల నిర్వహణపై శనివారం సదస్సు నిర్వహించారు. ఎటువంటి వివాదాలకు వెళ్లొద్దని వివిధ రాజకీయ పార్టీల నాయకులను హెచ్చరించారు. తొలుత ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన బీఎస్ఎస్ కృష్ణ మోహన్‌ను సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ సత్కరించారు.

హార్బరులో మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలి

అంతర్వేది, ఫిబ్రవరి 17: జనసేన రాజోలు నియోజకవర్గం ఆధ్వర్యంలో 'టీ విత్ డాక్టర్ బాబు' కార్యక్రమాన్ని అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో శనివారం నిర్వహించారు. డాక్టర్ రమేష్‌బాబు మత్స్యకారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ మత్స్యకారులకు అండగా ఉంటుందన్నారు. యెనుముల వెంకటపతిరాజా, రావూరి నాగు, అల్లూరి రంగరాజు, కొణతం నరసింహారావు, ఎంపీటీసీ భైరా నాగరాజు, ఉండపల్లి అంజి, గ్రామ శాఖ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జక్కంపూడి శ్రీదేవి, ఆవుపాటి శివ జ్యోతిసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 17: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ కుమారశాస్త్రి అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయవాదులు వీకేఎస్ భాస్కరశాస్త్రి, కేవీవీ శ్రీనివాసరావు, ఎల్.భార్గవి, లెఫ్టినెంట్ ఏవీ శర్మ, డీవీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన సచివాలయంలో సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ రహ్మతుల్లా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చట్టాలు, రోడ్డు భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని, లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నచిన్న సంఘటనలను పోలీసుస్టేషన్ల వరకు తీసుకువెళ్లి విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోకూడదని సూచించారు. మహిళల కోసం ఉన్న చట్టాలను వివరించారు. ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు, ఎంపీఐ కాశి, అసోసియేషన్ అధ్యక్షుడు కొండేపూడి లక్ష్మీవరప్రసాదరావు, దోనిపూడి ఆంజనేయులు, ఎలిపే సత్యనారాయణబాబు, దాసరి సత్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: రాజధాని ఫైల్స్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ఐ హేట్ లవ్
రమా	: గుంటూరు కారం
గణపతి	: హాయ్ నాన్న
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఊరుపేరు భైరవకోన
వెంకటపద్మావతి స్క్రీన్-2	: యాత్ర-2

తాడి సోదరులకు పరామర్శ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17: మాతృ వియోగంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు సోదరుడు జానకీరామ్, సోదరి అల్లాడి రమణీకుమారిలను మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ శనివారం పరామర్శించారు. దివంగత తాడి తాతారావు సతీమణి పొన్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ, కాకినాడ మాజీ మేయర్ పి.సరోజ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజ్ చైర్మన్ కాశి బాలమునికుమారి, పెన్మెత్స చిట్టిరాజు, పెన్మెత్స జగ్గప్పరాజు, బండారు సత్తిబాబు, ధర్నాల రామకృష్ణ, కటకంశెట్టి శ్రీనివాస్, గుబ్బల మూర్తి, ముత్యాల బాబ్జి, దాట్ల బాబు, సానబోయిన మల్లికార్జునరావు, దూడల స్వామి తదితరులు పరామర్శించారు.

బాలబాలాజీ సేవలో న్యాయమూర్తి



మామిడికుదురు, ఫిబ్రవరి 17: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు సతీసమేతంగా శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. అనంతరం అర్చకులు శేషవస్త్రంతో వేదాశీర్వచనం ఇచ్చి స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సహాయ కమిషనర్ జి.మాధవి, డిప్యూటీ తహసీల్దార్ కె.శరణ్య, ఎస్ఐ పి.సురేష్, సిబ్బంది, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.